ఉచితంగా ఆధునిక విద్యాబోధన

- సిఎం సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో స్వచ్ఛంద సంస్థల ఒప్పందాలు

స్వచ్ఛంద సంస్థలతో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికతో కూడిన ఆధునిక విద్యాబోధనను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దానిలో భాగంగా ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో విద్యారంగంలో స్వచ్ఛందంగా విశేష సేవలు అందిస్తున్న సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థలతో విద్యాశాఖ ఈ ఒప్పందాలు చేసుకుంటుందని తెలిపారు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్‌పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ పౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థలు ప్రభుత్వంతో ఈ ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తుంది.

నందన్ నీలేకని నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేథ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌తో 540 పాఠశాలల్లో పని చేస్తుంది. దశలవారీగా 33 జిల్లాల పరిధిలో ఐదు వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరిస్తుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు, మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఫిజిక్స్ వాలా ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు విదార్థుల్ని సన్నద్ధుల్ని చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో వీడియో ఆధారిత స్టీమ్ ద్వారా శిక్షణ అందిస్తుంది. డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 (ఇంటర్) వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తుంది. పై జామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణ ఇస్తుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత, విద్యావకాశాలను మెరుగుపరుస్తుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, విద్యాశాఖ స్పెషల్ సెక్రటరీ హరిత, ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సిఇఒ జగదీశ్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డాక్టర్ సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కో-ఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి వాసుదేవన్, పైజామ్ పౌండేషన్ ఫౌండర్ షోయబ్‌దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సిఇఒ గాయత్రి నాయిర్ లోబో తదితరులు పాల్గొన్నారు.

మీ 'స్కిల్'కు సహకరిస్తాం

- సిఎం రేవంత్‌రెడ్డితో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఏర్పాటుచేసిన స్కిల్ యూనివర్సిటీకి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని కేంద్ర పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. ఆదివారంనాడాయన జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని కేంద్రమంత్రికి వివరించారు. నిరుద్యోగులకు ప్రయివేటురంగంలో ఉపాధి అవకాశాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ దోహదపడుతుందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా వివిధ ప్రయివేటు సంస్థలు ప్రమోట్ చేస్తున్న శిక్షణా తరగతులు, కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సిఎం కేంద్ర మంత్రికి వివరించారు. సోమవారం జరగనున్న కౌశల్‌మందన్ కార్యక్రమంలో హాజరయ్యేందుకు కేంద్రమంత్రి జయంత్ చౌదరి హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సిఎంను కలిశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జె వెంకటేష్

జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ పిలుపునిచ్చారు. సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలోని ఆ సంఘం నగర కార్యాలయంలో జరిగిన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి ఎనిమిది గంటల పనిదినం స్థానంలో 12 గంటలు పని దినాన్ని ప్రవేశపెడుతున్నదని విమర్శించారు. కార్మికులను ఎప్పుడంటే అప్పుడు తొలగించుకునే స్వేచ్ఛను యజమానులకు కట్టబెట్టారన్నారు. కార్మికులు కనీస వేతనం రూ 26 వేలు అడుగుతుండగా మోడీ ప్రభుత్వం మాత్రం ఫ్లోర్ లెవెల్ వేజ్ రూ.178గా నిర్ణయం చేసిందని తెలిపారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని అడుగుతుంటే మోడీ ప్రభుత్వం ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పద్ధతిని తీసుకువచ్చి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నదన్నారు. సిఐటియు నగర కార్యదర్శి ఎం. వెంకటేష్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల్లో మహిళలు రాత్రిపూట పనిచేసే విధంగా చట్టాలను సవరించారని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్స్ వల్ల పీఎఫ్ చట్టం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు మల్లేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌సి వర్గీకరణ అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ జిఒను విడుదల చేసింది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో గెజిట్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ఎస్‌సి వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీ అమోదించిన విషయం తెలిసిందే. ఎస్‌సి వర్గీకరణ చట్టం (2025) అమలు కోసం జిఒ నెంబర్ 31ని జారీ చేసింది. 56 కులాలకు ఉన్న 15 శాతం ఉన్న రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా విభజించింది. ఏ గ్రూప్‌కు ఒక శాతం, బి గ్రూప్‌కు తొమ్మిది శాతం, సి గ్రూప్ ఐదు శాతం రిజర్వేషన్లను కేటాయించింది.

నేడు ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షల ఫలితాల వెబ్‌సైట్ లింక్‌లను అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్న మొబైళ్లకు పంపించనున్నట్టు వెల్లడించారు. జనరల్, వొకేషనల్ స్ట్రీమ్ లకు సంబంధించిన అభ్యర్థులు తమ ఫలితాలను వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుక్ చేసుకోండి

- టిజిఇసెట్ -2025 కన్వీనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించి వెంటనే స్లాట్ బుక్ చేసుకోవాలని సాంకేతిక విద్య కమిషనర్, టీజీఈసెట్ -2025 కన్వీనర్ శ్రీదేవసేన సూచించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాసెసింగ్ చెల్లింపు ప్రక్రియ ఈ నెల 14న ప్రారంభం కాగా 15వ తేదీ నాటికి 6,478 మంది బుక్ చేసుకున్నట్టు తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 17 నుంచి 21 వరకు ఆప్షన్ల ఎంపిక, 25న సీట్ల ప్రొవిజనల్ కేటాయింపు ఉంటుందని తెలిపారు. ముందుగా స్లాట్ బుక్ చేసుకుంటే ఆప్షన్ల ఎంపికకు తగిన సమయముంటుందని శ్రీదేవసేన సూచించారు.

ఈ-కారు రేసు కేసులో నేడు ఎసిబి విచారణకు కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఈ-ఫార్ములా కారు రేసింగ్ కేసులో నిందితుడైన బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు సోమవారం ఎసిబి అధికారుల ఎదుట విచారణకు హాజరు కానున్నారు. ఉదయం పది గంటలకు ఎసిబి అధికారుల ఎదుట ఆయన హాజరవుతారని తెలిసింది. ఈ ఫార్ములా కారు రేసింగ్‌కు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా రూ.44 కోట్లను విదేశీ కంపెనీకి బదలాయింపు చేశారనే ఆరోపణలను కెటిఆర్ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ఇప్పటికే కెటిఆర్‌ను ప్రశ్నించిన ఎసిబి... రెండో నిందితుడు అప్పటి హెచ్‌ఎండిఏ ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, మూడో నిందితుడు హెచ్‌ఎండిఏ సిఇఒ బీఎల్ఎన్.రెడ్డిలతో పాటు ఈ ఫార్ములా కారు రేసింగ్‌కు సంబంధించిన ఇద్దరు విదేశీ ప్రతినిధులను సైతం ప్రశ్నించింది. కాగా, ఈ కారు రేసింగ్‌కు నిర్వహించడానికి తాను ఎలాంటి పొరపాట్లు చేయలేదనీ, అక్రమాలకు పాల్పడలేదని వాదించిన కెటిఆర్ దీనిని ఒక లొట్టపీసు కేసుగా ఇప్పటికే అభివర్ణించారు.

నీట్‌లో ర్యాంక్ రాలేదని యువతి ఆత్మహత్య

- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ పరీక్షా ఫలితాల్లో మార్కులు తక్కువగా వచ్చాయని యువతి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం నారాయణపూర్ తండాలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్ తండాకు చెందిన ఇస్లావత్ శ్రావణి (17) చైతన్యపురి అపోలో ఫార్మసీలో నీట్ పరీక్ష కోసం శిక్షణ తీసుకొని పరీక్ష రాసింది. నీట్ ఫలితాల్లో మార్కులు తక్కువగా రావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వ్యవసాయ పొలానికి వెళ్ళిన తల్లిదండ్రులు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉరేసుకొని ఉండటాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. కాగా, రెండో ప్రయత్నంలోనూ నీటిలో మంచి ర్యాంకు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు.

సరితకు రవాణామంత్రి శుభాకాంక్షలు

- డ్రైవర్‌గా ఉద్యోగం ఇవ్వాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్ సరితకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఆర్‌టిసి మహిళా సాధికారత దిశగా పయనిస్తోందని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఆర్‌టిసి జేబీఎమ్ సంస్థకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా సరితకు ఉద్యోగం ఇప్పించారని తెలిపారు. మహిళా డ్రైవర్ సరిత కూడా రవాణాశాఖ మంత్రికి ధన్యవాదాలు చెప్పారని వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి డ్రైవింగ్ విభాగంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సిత్య తండాకు చెందిన వీ సరిత మిర్యాలగూడ డిపోలో జేబీఎమ్ సంస్థ నుంచి ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సు మహిళా డ్రైవర్‌గా విధుల్లో చేరారనీ, ఆమె హైదరాబాద్ టూ మిర్యాలగూడ బస్సును నడుపుతున్నారని వివరించారు. ఆమె గతంలో ఢిల్లీలో రవాణా సంస్థలో పదేండ్లు డ్రైవర్‌గా విధులు నిర్వహించారనీ, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తనకు స్వస్థలంలో డ్రైవర్‌గా అవకాశం ఇవ్వాలని ఇటీవల రవాణా శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి జేబీఎమ్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, తెలంగాణ ఆర్‌టిసి మిర్యాలగూడ డిపోలో నియమించారని చెప్పుకొచ్చారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

తెలంగాణలో తొలి మహిళా డ్రైవర్ అయిన సరితకు టిజిఎస్‌ఆర్‌టిసిలోనే పర్మినెంట్ డ్రైవర్‌గా ఉద్యోగం ఇచ్చి గౌరవం కల్పించాలని టిజిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌ను రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్ సరితను ఆర్టీసీలో నియమించకుండా ప్రయివేటు కార్పొరేట్ కంపెనీ అయిన జేబీఎమ్ సంస్థలో, మంత్రి గారి సహకారంతో తాత్కాలిక ఉద్యోగం కల్పించి, అదేదో గొప్పపని చేసినట్టు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

'కారుణ్యం' చూపండి-ఎన్ఎమ్‌యూ

గతంలో 55 రోజుల ఆర్‌టిసి సమ్మె సందర్భంగా ప్రాణత్యాగాలు చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు వెంటనే సంస్థలో పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని ఎన్ఎమ్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కమాల్‌రెడ్డి కోరారు. ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్ సరిత అని ప్రభుత్వం ప్రచారం చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆమె ప్రయివేటు బస్సు డ్రైవర్ అనీ, ఆర్‌టిసితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆమెకు తక్షణం ఆర్టీసీలోనే పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలనీ, దానితోపాటే ప్రాణత్యాగాలు చేసిన ఆర్టీసీ కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా కారుణ్య నియామకాల ద్వారా పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

ప్రజాకవులను మరిచిపోవడం విచారకరం

- మరో 'నంది'లా గద్దర్ అవార్డు: కంచ ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సంస్కృతి భూస్వామ్య స్థితి నుంచి ప్రజాస్వామ్య రూపంలోకి మారడంలో గణనీయ పాత్ర పోషించి, ఆడిపాడిన వందలాది మంది కళాకారులను, ప్రజా గాయకులను, రచయితలను రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోవడం బాధాకరమని ప్రొఫెసర్ కంచ ఐలయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం జరిగిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం సినీ నటులు, రాజకీయ నాయకుల వేడుకలా కనిపించిందని విమర్శించారు. ప్రజాకవులను విస్మరించడాన్ని తప్పుబట్టారు. 'నేను గద్దర్‌కు దగ్గరి మిత్రుడిని. కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని ఒప్పించా. నేను రాహుల్ గాంధీకి, తెలంగాణ ప్రభుత్వానికి మద్దతిస్తున్నాను. అందుకు ప్రతిగా దూషణలు, బెదిరింపులు ఎదుర్కొంటున్నాను. గద్దర్ పేరిట అవార్డు ప్రకటించడం ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతిలో కొత్త విప్లవం మొదలవుతుందని భావించాను. కానీ ఇప్పుడు సినిమా రంగాన్ని ఏయే కులాలు ఆధిపత్యం చేస్తున్నాయో, ఎవరు పెత్తనం చేస్తున్నారో మనకందరికీ తెలుసు. వారు తెలంగాణ ప్రజల సంస్కృతి పట్ల ఎలాంటి వైఖరితో ఉంటారో కూడా మనకు తెలుసు. డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్న సినిమా సంస్కృతిని మార్చి, పూలే తరహా కొత్త తెలుగు సినిమా నిర్మాణ సంస్కృతిని తీసుకురావాలని గద్దర్ అవార్డు ద్వారా ఆశించాం. కానీ, అటువంటి కొత్త ప్రారంభం ఎక్కడా కనిపించలేదు. అవార్డు జ్యూరీలో ఒక్క జానపద కళాకారుడు కూడా లేడు. అందరూ డబ్బు కోసం పనిచేసే సినిమా కళాకారులే. ప్రజల కళలకు ప్రాతినిధ్యం ఎక్కడ? జ్యూరీలో గద్దర్ సాంస్కృతిక ప్రతినిధి ఎక్కడా? గద్దర్ పాపులర్ పాట అయినా "పొడుస్తున్న పొద్దుమీద" అనే పాటకు ప్రాతినిధ్యం వహించే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి కళాకారులెక్కడ? గద్దర్ అంటేనే ప్రజా పాట. అవార్డు ప్రదాన సమయంలో అటువంటి ప్రజా పాటల, ప్రజా కళాకారులకు సంబంధించిన ప్రజా కళల ప్రతినిధులెక్కడ? వారికి ఆహ్వానం ఎందుకు పంపలేదు? ప్రజా కవులను విస్మరించడం ఎంతవరకు సబబు? గద్దర్ అవార్డును మరో నంది అవార్డుగా మార్చేశారా?' అని విమర్శలు ఎక్కుపెట్టారు.

విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి

- ఏడుగురికి తీవ్ర గాయాలు
- జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘోరం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరెంట్ షాక్‌తో ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఓ వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డులో బాలాజీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో భారీ విగ్రహాలను మరో చోటుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో 33 కెవి విద్యుత్ వైర్లు తగలడంతో కరెంట్ షాక్ తగిలి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అల్వాల వినోద్, అల్వాల నితిన్, వెంకట్‌రెడ్డి, రాజేష్, నెల్లుట్ల బంటి, నెల్లుట్ల కృష్ణ సాయినాథ్, హనుమంతు, ఆకాష్, రోషన్ గాయపడ్డారు. వారిని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి బాలాజీ విగ్రహాల తయారీ కేంద్రం యజమాని అల్వాల వినోద్, కార్మికుడు సాయి చనిపోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సిపిఎం నాయకులు తిరుపతి నాయక్ బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

వారంలో రైతు భరోసా

- ఏరువాక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వారంలోగా రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆరుగాలం కష్టపడి దేశ ప్రజలకు అన్నంపెట్టే రైతన్నలకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఆదివారం ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. జోడెడ్ల అరక దున్ని రైతులతో కలిసి విత్తనాలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తాను అమితంగా ప్రేమించే పాలేరు నియోజకవర్గ రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఏరువాక సాగు కార్యక్రమంలో అరక పట్టి, దుక్కిదున్ని, రైతులతో కలిసి విత్తనాలు నాటడం సంతోషాన్నిచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రైతును రాజు చేయాలనేదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక స్థితి బాగోలేకపోయినా ప్రభుత్వం రైతులను ప్రోత్సాహిస్తోందన్నారు. గత ప్రభుత్వం పదేండ్లలో రైతులకు రూ.17000 కోట్ల రుణమాఫీ చేస్తే, తమ ప్రభుత్వం 18 నెలల్లోనే రూ.21000 కోట్లు మాఫీ చేసిందని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గత ప్రభుత్వం వారి స్వార్థం కోసం ప్రాజెక్టులు మొదలు పెట్టి అర్ధాంతరంగా వదిలేస్తే వాటిని పూర్తి చేస్తూ సాగు నీటిని అందిస్తామన్నారు. వ్యవసాయానికి యోగ్యమైన ప్రతి ఎకరానికీ పెట్టుబడి కోసం రూ.12 వేలు ఇస్తామన్నారు. రైతు భరోసా ఇప్పటికే రెండు సార్లు ఇచ్చామని, వారంలోగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. కాళేశ్వరం కూలినా కూడా దేశంలో అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ వెన్నపూసల సీతారాములు, సీడీసీ చైర్మెన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనకచర్లతో రాష్ట్రానికి నష్టం

- పోరాడండి...మీ వెంట బిఆర్ఎస్ ఉంటుంది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బనకచర్ల లింకు ప్రాజెక్టుతో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన 45 టిఎంసిలతోపాటు 112.5 టిఎంసిల అదనపు వాటా కోసం ట్రిబ్యునల్ ముందు వాదించే అవకాశం ప్రభుత్వానికి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నీటి హక్కుల కోసం పోరాడండి... మీ వెంట బిఆర్ఎస్ ఉంటుందని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టిఎంసిల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం, డిజైన్‌ను కేంద్రానికి సమర్పించి, తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించేలోపే, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సిన నేపథ్యంలో ఎపి ప్రభుత్వం యూనిలేటరల్‌గా ముందుకు పోవడం అన్యాయమని పేర్కొన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ జూన్ 13, 2025న కేంద్ర జలశక్తి మంత్రికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్టు తెలిపారు. ఎపి ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరు... 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు.

గుండె జబ్బులపై అంతర్జాతీయ కార్డియాలజీ సదస్సు

- యశోద హాస్పిటల్ నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్

గుండె జబ్బుల చికిత్సలో వచ్చిన అధునాతన వైద్య విధానాలు, 'అడ్వాన్స్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ' పై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్ షాప్‌ను యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ జిఎస్ రావు, ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టులతో కలిసి ప్రారంభించారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో రెండు రోజుల పాటు దీన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన సుమారు 500 పైగా కార్డియాలజీ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎస్ రావు మాట్లాడుతూ.. "మన దేశంలో కార్డియో-వాస్కులర్ వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నాయి ప్రపంచవ్యాప్తంగా కార్డియోవాస్కులర్ డిసీజ్, అత్యధిక భారం ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటి. దేశంలో సివిడి వార్షిక మరణాల సంఖ్య 1990లో 22.6 లక్షలుగా ఉండగా.. 2020 నాటికి 47.7 లక్షలకు పెరిగాయని అంచనా. వైద్య నిపుణులచే బోధించబడే అత్యాధునిక ఇన్‌స్ట్యూట్స్‌లో ఒకటిగా యశోద హాస్పిటల్స్ నిలిచింది." అని జిఎస్ రావు అన్నారు. ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ ప్రధాన కార్డియలజిస్ట్‌లు కార్డియలజీ వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విజ్ఞానం, చికిత్సా విధానాలను వారు వివరించారని యశోద హాస్పిటల్స్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి రాజశేఖర్ పేర్కొన్నారు.

నీట్‌లో ఆకాశ్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్ బ్యూరో : నీట్-2025లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చారని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎఇఎస్ఎల్) తెలిపింది. హైదరాబాద్‌కు చెంబదిన 15 మంది విద్యార్థులు అత్యుత్తమ స్కోర్లు సాధించి టాప్ స్కోరర్లుగా నిలిచారని పేర్కొంది. కె నిఖిల్ సాయికి ఆల్ ఇండియా ర్యామక్ 297, కునాల్ మందనకు 479 ర్యాంక్, రుత్విక్ జోషి 557 ర్యాంక్, తేజేశ్వర్ క్రిష్ణమూర్తి 620 ర్యాంక్, హమ్జా నిషార్ బాషా 686 ర్యాంక్‌లను కైవసం చేసుకున్నారని వెల్లడించింది. ఈ అపూర్వ విజయానికి విద్యార్థుల కృషి, తాము అందించిన అత్యుత్తమ శిక్షణ, మార్గనిర్దేశన ప్రధాన కారణాలుగా నిలిచాయని ఎఇఎస్ఎల్ బిజినెస్ హెడ్ దీరజ్ కుమార్ మిశ్రా తెలిపారు.

పురుషుల ఫెర్టిలిటీ అపోహలపై ఓయాసిస్ క్యాంపెయిన్

హైదరాబాద్ బ్యూరో : ప్రముఖ ఫెర్టిలిటీ చెయిన్ ఒయాసిస్ ఫెర్టిలిటీ ఫాదర్స్ డే సందర్భంగా "హ్యాపీ ఫాదర్స్ టు బి డే" అనే మరో ప్రత్యేకమైన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. మగవారిలో వంధ్యత్వ సమస్యల గురించి 'హెల్తీ మ్యాన్, హ్యాపీ ఫాదర్' థీమ్‌తో అవగాహన కల్పించడం, సంతానం పొందడంలో మగవారి పాత్ర ఎంత ఉందో తెలియచేయడం దీని లక్ష్యమని ఒయాసిస్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ హెడ్ డాక్టర్ కృష్ణ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 15 శాతం జంటలు వంధ్యత్వంతో బాధపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు డిసిపి ఎ రాములు, ఒయాసిస్ ఫెర్టిలిటీ సిఇఒ పుష్కరాజ్ షెనాయ్ హాజరయ్యారు.

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణానికి టిఆర్ఎల్డి కృషి

- కేంద్ర మంత్రి జయంతి చౌదరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ (టిఆర్ఎల్డి) కృషి చేస్తుందని కేంద్ర మంత్రి జయంతి చౌదరి అన్నారు. ఆదివారం కవాడిగూడలో టిఆర్ఎల్డి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి జయంతి చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2012 - 2014 మధ్య కాలంలో తెలంగాణ ఉద్యమంలో పార్టీ కీలకపాత్రతో పాటు, తాను కూడా నేరుగా పాల్గొన్న విషయాన్ని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో పార్టీని మళ్లీ బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను కార్యకర్తలకు వివరించారు. రైతులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు విఫలమయ్యాయని విమర్శించారు. సామాజిక న్యాయం కోసం పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళాధ్యక్షురాలు కె ఇందిరా, వర్కింగ్ ప్రెసిడెంట్ కిన్నెర సిద్ధార్థ్, గిరి కుండే, విశాల్ వంజారి, మల్లేశ్ గౌడ్, ఖుషట్ జైన్, ఓంకార్ గౌడ్, మడకం ప్రసాద్, నునే భాస్కర్‌రావు, నరసింహారావు, కోరె సాయిరామ్, ప్రధాన కార్యదర్శులు, హైదరాబాద్ అధ్యక్షులు టైగ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బీరప్ప, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆగస్ట్ 30, 31 తేదీల్లో గ్రామ పంచాయతీ
యూనియన్ రాష్ట్ర మహాసభలు

- జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి
- పెండింగ్ వేతనాలు ఇవ్వాలని 27న చలో హైదరాబాద్
- యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రతతో పాటు హక్కుల పరిరక్షణకై నిరంతరం పోరాడుతున్న తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభలు ఆగస్టు 30, 31 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండల కేంద్రంలో జరుగుతాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవనంలో రాష్ట్ర అధ్యక్షులు జి.పాండు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల లాభాల కోసం కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు ఇతర డిమాండ్ల సాధనకై జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో పంచాయతీ కార్మికులు మల్టీ పర్పస్ వర్కర్ విధానంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల అనేకమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఆదివారం, పండుగ సెలవులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న జరిగే చలో హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమానికి పంచాయతీ సిబ్బంది పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ రాష్ట్ర మహాసభల జయప్రదానికి ఆహ్వాన సంఘం కమిటీని ప్రకటించారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా జువ్వాజీ నర్సింహారావు, అధ్యక్షులుగా పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా బండ్ల అప్పిరెడ్డి, కోశాధికారిగా కుంట ఉపేందర్, చీఫ్ ప్యాట్రన్స్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులుగా 65 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, నాయకులు పాలడుగు సుధాకర్, ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, పోతుగంటి మల్లయ్య, వల్లాల వెంకన్న, జల్లే జయరాజు, బాబుగౌడ్, యూనియన్ జిల్లా నాయకులు ఎండీ మొయినుద్దీన్, సుధాకర్, లతీఫ్, ఎల్లయ్య, సురేష్, అశోక్, మల్సూర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొర్ర ఈశ్వర్ లాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సేవలు అమూల్యమైనవని, విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తూనే అరకొర జీతాలతో అంకితభావంతో బోధిస్తున్న డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సేవలను కొనసాగించాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా॥కొర్ర ఈశ్వర్ లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా మండలి ఆదేశానుసారం అకాడమిక్ క్యాలెండర్‌లో భాగంగా నెల 4వ తేదీ నుంచి రాష్ట్రంలోని పది ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న 149 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ద్వితీయ, తృతీయ సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయని, జులై రెండు నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ డిగ్రీ కళాశాలల్లో 30 శాతం నుంచి 90 శాతం వరకు బోధన గెస్ట్ లెక్చరర్లపై ఆధారపడి నడుస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇప్పటి వరకు ఫైనాన్స్ అప్రూవల్, గెస్ట్ లెక్చరర్ల నియామక నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం అలస్యమవుతుందని తెలిపారు. కాబట్టి గత ఐదారు సంవత్సరాలుగా బోధన చేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సేవలను వెంటనే రెన్యువల్ చేయాలని, తద్వారా విద్యార్థులకు సమయానుకూలంగా సిలబస్ పూర్తి చేసే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందేలా చూడాలని ప్రభుత్వాన్ని, ప్రత్యేకించి ఉన్నత విద్యా కమిషనర్ విద్యాశాఖ కార్యదర్శిని కోరారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా నియమించాలి

- డిఎంఇకి హెచ్‌ఆర్‌డిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు డైరెక్టుగా నియామక ప్రక్రియ చేపట్టాలని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డిఎ) కోరింది. ఈ మేరకు హెచ్‌ఆర్డీఏ అధ్యక్షులు డాక్టర్ కె బ్రహ్మేశ్వర్ తదితరులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేందర్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో ప్రతి ఏడాది దాదాపు 1,100 మంది పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్లు తమ శిక్షణ పూర్తి చేసుకుంటున్నారనీ, రెగ్యులర్‌గా నోటిఫికేషన్లు వేయకపోవడంతో వీరు రాష్ట్రం బయట లేదా రాష్ట్రంలో ప్రయివేటు సంస్థలకు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో రెగ్యులర్ నోటిఫికేషన్లతో ప్రభుత్వ వైద్యవిద్యతో పాటు ప్రభుత్వ వైద్యం నిరంతరం బలోపేతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని గుర్తుచేశారు.

సహాయ పరికరాల దరఖాస్తు గడువు పొడిగించాలి : ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: సహాయ పరికరాల దరఖాస్తూ గడువు ఈ నెల 30 వరకు పొడగించాలనీ, లేదంటే 17న డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. షరతులు పెట్టి వికలాంగులకు సహాయ పరికరాలు అందకుండా అధికారులు చేస్తున్నారని ఆరోపించారు. దరఖాస్తుకు అవసరమైన సర్టిఫికెట్లు తీసుకోవడానికి కనీసం 15 రోజుల సమయం పడుతుందనే విషయం అధికారులు అర్థం చేసుకోవాలని సూచించారు. 40 శాతం వైకాల్యం ఉన్న వాళ్లందరికీ మోటారైస్డ్ వాహనాలు మంజూరు చేస్తామని చెప్పిన అధికారులు దరఖాస్తూ చేయడానికి మీ సేవా కేంద్రాలకు వెళ్ళితే అఫిడవిట్‌తో పాటు తహశీల్దార్ నుండి అన్‌ఎంప్లాయ్ సర్టిఫికెట్ తీసుకుని దరఖాస్తుకు జత చేయాలని నిబంధన పెట్టడం మోసం చేయడమే అవుతుందని విమర్శించారు.

రైతు వేదికల్లో నేడు 'రైతు నేస్తం'

- ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1034 రైతు వేదికల్లో సోమవారం 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమ ఏర్పాట్లను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. కలెక్టర్లు రైతు వేదికల్లో అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా తుమ్మల సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది రైతులు పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే 566 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించామన్నారు. ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముఖాముఖి, ఆదర్శరైతుల అనుభవాలు,

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులకు వివరిస్తామన్నారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు వివిధ రైతుల అనుభవాలను తెలుసుకున్నారని తెలిపారు. తొలకరి ఆరంభమై వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న వేళ, రాష్ట్రవ్యాప్తంగా వున్న రైతు వేదికల్లో హాజరైన రైతులతో సిఎం, డిప్యూటీ సిఎం ముఖాముఖి ముచ్చటించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఒకటిన్నర సంవత్సరంలోనే దాదాపు రూ.78,000 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతాంగం సుభిక్షంగా ఉండేటందుకు ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని పథకాలను ఇప్పటికే అమలు చేసి వివిధ రాష్ట్రాలకు దశ, దిశ చూపించిందన్నారు. రుణమాఫీ, సన్న ధాన్యానికి బోనస్, అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు, అన్ని పంటలకు సబ్సిడీపై సూక్ష్మ సేద్య పరికరాల సరఫరా వంటివి మచ్చుతునక అని తెలిపారు.

భట్టి విక్రమార్కకు తుమ్మల జన్మదిన శుభాకాంక్షలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్‌టిఐ చట్టాన్ని కాపాడుకోవాలి

- సమాజానికి పనికొచ్చే సమాచారాన్ని రాబట్టాలి
- చర్చా గోష్టిలో ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

చర్చా గోష్టిలో మాట్లాడుతున్న ప్రొ మాడభూషి శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజానికి పనికొచ్చే ప్రశ్నలడగడం ద్వారా ఆర్‌టిఐ చట్టాన్ని కాపాడుకోవాలని కేంద్ర మాజీ సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు అన్నారు. సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్), పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ (పిఎఫ్ఆర్ఐ) సంయుక్తంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "ఆర్‌టిఐ చట్టం అమలు తీరు.. పొంచి ఉన్న ప్రమాదాలు" అనే అంశంపై ఆదివారం చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది అధికారులు ప్రశ్న రూపంలో అడిగితే సమాచారం ఇవ్వడం లేదని, సమాచారం రాబట్టడం ప్రధానం తప్ప ఏ రూపంలో అడిగారు అనేది ప్రధానం కాదని అన్నారు. అలాంటి వారికి ప్రశ్న రూపంలో కాకుండా కావలసిన సమాచారాన్ని రాబట్టే పద్ధతిలో అడిగి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే అతి గొప్ప సమాచార హక్కు చట్టం మనదేశంలో ఉన్నదనీ, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని గుర్తు చేశారు. ఆర్టీఐ నిపుణులు శ్రీనివాస్ మాదవ్ మాట్లాడుతూ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 (డిపిడిపి) పేరిట కేంద్రం తీసుకొచ్చిన చట్టం వల్ల ఆర్‌టిఐ చట్టం లక్ష్యం దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తుల గోప్యత పేరిట సామాజిక సమాచారాన్ని కూడా అధికారులు దాటవేసే అవకాశముందని పేర్కొన్నారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే ప్రజాస్వామ్యం బతుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. దురదృష్ట వశాత్తు నేటి యువతలో అది సన్నగిల్లిందని అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె పార్థసారథి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రమాదంలో ఉన్నదనీ, దాన్ని కాపాడుకోవటం కోసం ప్రజా సంఘాలు, సంస్థలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె వీరయ్య, పిఎఫ్ఆర్ఐ అధ్యక్షులు యాదయ్య అధ్యక్షత వహించారు.

ప్రశ్నించేతత్వం మనతో ఆగొద్దు

- 'లీడర్' పోస్టర్ ఆవిష్కరణలో కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: యువత, విద్యార్థులకు, మహిళలకు ఒక రాజకీయ శిక్షణా వేదికగా తెలంగాణ జాగృతి మారబోతున్నదని ఆ సంస్థ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని వారికి ఇదోక వేదిక అన్నారు. యువత రాజకీయాల్లోకి వస్తే స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ గడ్డ అంటే ప్రశ్నించేతత్వమనీ, అది మనతో ఆగవద్దనీ, ముందు తరాలకు దాన్ని నేర్పించాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో 'లీడర్' పేరిట నిర్వహించేబోయే రాజకీయ శిక్షణా తరగతుల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. నెల మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, యువత శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

సిఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులపై
కేసులెందుకు పెట్టరు?

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులెందుకు నమోదు చేయడం లేదనీ మాజీ పోలీస్ అధికారి, బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రికి, ఆయన సోదరులకు ఒక చట్టం, ఇతరులకు వేరే చట్టం ఉందా? ఉంటే చెప్పాలని కోరారు. ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించి ప్రధాన నిందితుడు సిఎం రేవంత్ రెడ్డి అని తాను కేసు పెట్టానని, తనకు తెలియకుండా ఆ కేసును పోలీసులు క్లోజ్ చేశారని ఆరోపించారు. అదే విధంగా సిఎం రేవంత్ రెడ్డి సోదరుని దౌర్జన్యంతో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నా.. అతనిపైనా చర్యల్లేవని విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులపై పెడుతున్న కేసులు అక్రమ కేసులనీ, గాంధీభవన్ లో రహస్య ఎఫ్ఐఆర్‌లు

తయారవుతున్నాయని విమర్శించారు. కొణతం దిలీప్‌తో సహా బిఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెటిఆర్‌పై పెట్టిన తప్పుడు కేసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ విసిరిన లైడిటెక్టర్ సవాల్‌కు సిఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అమెరికాకు వెళ్లి కెటిఆర్ తెలంగాణకు, దక్షిణ భారతదేశానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించినందుకు కేసులు పెడుతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఏమైంది..?

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర మంత్రివర్గ కూర్పులో ఎందుకు పాటించలేదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత వి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ఇక చెత్తబుట్టలో పారేయాల్సిందేనని విమర్శించారు. ఏడాదికి రూ.20 వేల కోట్లు బిసిలకు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పి ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. బిసిలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఆ వర్గాల ఓట్లను ఎలా అడుగుతుందని నిలదీశారు. పిఎం నరేంద్రమోడీతో సీఎం రేవంత్ రెడ్డి బిసి బిల్లు చట్టబద్ధతపై ఎందుకు చర్చించలేదో చెప్పాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పచ్చని పల్లెల్లో 'ఇథనాల్' మంటలు

- కాలుష్యకారక కంపెనీలొద్దంటున్న జనం
- ఆరోగ్యం, పర్యావరణం దెబ్బ తింటుందని సర్వత్రా ఆందోళన
- దిలావర్‌పూర్ నుంచి దన్వాడ వరకు నిరసనలు
- ప్రజాందోళనలను పట్టించుకోని ప్రభుత్వం, ప్రధాన పార్టీలు
- పోలీసుల తీరుపై ప్రజల్లో ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పచ్చని పల్లెల్లో ఇథనాల్ మంటలు మండుతున్నాయి. అదిలాబాద్ జిల్లా దిలావర్‌పూర్ నుంచి జోగులాంబ జిల్లా పెద్ద దన్వాడ వరకు ప్రజలు నిరసన బాటపట్టారు. ఇథనాల్ ఫ్యాక్టరీల ద్వారా వాయు, జల కాలుష్యం ఏర్పడి తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లా చిత్తనూరులోనూ ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై నిరసనలు వ్యక్తమైనా, నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించింది. హిందూపూర్, ధర్మపురి, కామారెడ్డి, ఖమ్మం, సూర్యాపేట, మక్తల్ సిద్దిపేటలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20కి పైగా ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే స్థానికులు వీటిని అడుగడుగునా అడ్డుకుంటున్నారు. చిన్న పిల్లలు, మహిళలతో పాటు గ్రామాలకు గ్రామాలే మూకుమ్మడిగా రోడ్డెక్కుతున్నాయి.

ఆదిలాబాద్ జిల్లాలోని దిలావర్ పూర్ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును స్థానికులు అడ్డుకున్నారు. నాలుగు నెలల పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఏకంగా ఆర్‌డిఓను కారులోనే ఎనిమిది గంటల పాటు నిర్బంధించారు. పోలీసులపై ప్రజలు తిరగబడి దాడులు చేశారు. దీంతో వెనక్కి తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇచ్చిన నిర్మాణ అనుమతులను రద్దు చేసింది. చిత్తనూర్‌లో తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఎకలాస్‌పూర్, చిత్తనూర్, మక్తల్‌తో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజల ఆందోళనలను పోలీసులు అణిచి వేశారు. దాదాపు 100 మందికి పైగా ప్రజలపై కేసులు నమోదు చేశారు. కొంత మందిపై రౌడిషీట్ సైతం తెరిచారు. పోలీసుల లాఠీచార్జిల్లో అనేక మంది గాయపడ్డారు. ఎకలాస్‌పూర్‌కు చెందిన కటిక కాశిం అనే వ్యక్తి పోలీసుల దెబ్బలకు కోలుకోలేక ఆస్పత్రిలో చికిత్స పొంది చివరికి చనిపోయాడు. అయినా ఫ్యాక్టరీ ఏర్పాటు ఆగలేదు. గతేడాది నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తిని ప్రారంభించింది. తాజాగా జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడలోనూ పనులను చుట్టు పక్కల గ్రామాల ప్రజల నిరసనలతో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిచి పోయాయి. అయినా ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని జనం ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆందోళనకారులు పరిశ్రమ ఏర్పాటుచేస్తున్న గాయత్రి కంపెనీకి చెందిన సామగ్రి, కార్లు ధ్వంసం చేయడంతోపాటు కూలీలను తరిమేశారంటూ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలి ఠాణాలో కేసు నమోదైంది. వెయ్యి మందికిపైగా ఆందోళనలో పాల్గొనగా, 45 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. కేసులకు వెరవకుండా ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తూనే ఉన్నారు. తాజాగా భూ భారతి రెవెన్యూ సదస్సును సైతం గ్రామ రైతులు బహిష్కరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలంటూ శాంతియుత పోరాటం చేస్తున్నవారిని కంపెనీ యాజమాన్యం, బౌన్సర్లు, పోలీసులతో కలిసి భయభ్రాంతులకు గురిచేస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇథనాల్ కంపెనీల ఏర్పాటును ప్రజలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఈ పోరాటంలో సామానుయలు మినహా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు పాల్గొనడం లేదు. కాంగ్రెస్ వీటి ఏర్పాటుపై మౌనం వహిస్తుండగా, బిఆర్ఎస్, బిజెపికి చెందిన స్థానిక నేతలు అక్కడక్కడా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారే తప్ప వాటిని అడ్డుకునేందుకు ప్రజలతో కలిసి రావడం లేదు.

పోలీసుల తీరు ....

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలంటూ స్థానిక ప్రజలు చేస్తున్న ఆందోళనలు అక్కడక్కడా హింసాత్మకంగా మారుతున్నాయి. ప్రజలు మూకుమ్మడిగా రోడ్డెక్కి నిరసన చేపట్టిన సందర్భాల్లో పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దిలావర్‌పూర్, చిత్తనూర్, దన్వాడ తదితర ప్రాంతాల్లో పోలీసులు ఏక పక్షంగా నిరసన కారులపైనే కేసులు పెట్టడం జరిగిందనే విమర్శలున్నాయి. శాంతియుత పోరాటం చేస్తున్నవారిపై కంపెనీ యాజమాన్యం, బౌన్సర్లు కలిసి దాడులకు పాల్పడుతున్నా వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాడుల్లో గాయపడ్డ వారి నుంచి కనీసం ఫిర్యాదు కూడా స్వీకరించడం లేదని తెలుస్తోంది.

ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దు
నారాయణ, మాజీ సర్పంచ్ చిన్నదన్వాడ

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దు. ఈ కంపెనీ ఏర్పాటైతే దన్వాడ గ్రామం వల్లకాడవుతది. నీరు పాడై మనుషులతో పాటు మూగ జీవాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. పచ్చని పంట పొలాలు, ప్రజల మధ్యన కాకుండా ఏ అటవీ ప్రాంతాల్లోనో కంపెనీని ఏర్పాటు చేసుకోండి. దయ చేసి మా గ్రామాన్ని వదిలి పెట్టండి.

దాడుల చేయడం మాకు తెలియదు
బజారమ్మ.పెద్ద దన్వాడ

"పెద్దదాన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో నా కుమారుడిని అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు కొట్టుకుంటూ లాక్కెళ్లారు. నా కొడుకును రక్షించండంటూ కాళ్లా వేళ్లా పడ్డా కనికరించలేదు. అయ్యా మాకు పంటలు పండించడమే తప్ప దాడులు చేయడం తెలియదు"

కేసులను ఎత్తివేయండి
హన్మమ్మ, ఎకలాస్‌పూర్, మరికల్

చిత్తనూర్ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రెండేండ్ల క్రితం పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. చిత్తనూర్, ఎకలాస్‌పూర్, జిన్నారంతో పాటు చుట్టు పది గ్రామాల ప్రజలు రోడ్డెక్కారు. మూడు గ్రామాలకు చెందిన 98 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎనిమిది మందిపై రౌడిషీట్ ఓపెన్ చేశారు. నా భర్త రాంచంద్రయ్యను రాత్రి పూట ఇంటినుంచి కొట్టుకుంటూ తీసుకెళ్లి రిమాండ్‌కు తరలించారు. నెల రోజుల పాటు జైళ్లోనే ఉన్నారు. ప్రజల ఆందోళనలు పట్టించుకోకుండా ఫ్యాక్టరీని నిర్మించి, ఇథనాల్ తయారు చేస్తున్నారు. కాని మేం మాత్రం రెండేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఈ ప్రభుత్వం ఎవరి కోసం? మాపై పెట్టిన కేసులను ఎత్తేయాలి.